


WWW.VIJAYAKERATAM.COM RNI: APTEL/2010/34724

# విజయకెరటం

తెలుగు దినపత్రిక

నిజం మా ధ్యేయం - ప్రజలే మా లక్ష్యం

VIJAYA KERATAM TELUGU DAILY




ఆగస్టు 31 సోమవారం 2026 | సంపుటి : 18 | సంచిక : 208 | పేజీలు : 4 | వెల రూ. 2.00/- | ఎడిటర్ : యం.డి.మక్సూద్ అహ్మద్

MONDAY AUGUST 31 2026 | VOL:18 | ISSUE: 208 | PAGES:4 | Rs. 2:00 | EDITOR:MD. MaKsood Ahmed

## తెలంగాణలో చురుగ్గా రుతుపవనాలు.. పలు జిల్లాలకు హెచ్చరిక

తెలంగాణలో పలు జిల్లాలకు యెల్లో అలర్ట్ జారీ

బంగాళాఖాతం ప్రభావంతో చురుగ్గా రుతుపవనాలు

ఉత్తర, తూర్పు జిల్లాల్లో ఉరుములతో కూడిన భారీ వర్షాలు

గంటకు 30-40 కి.మీ వేగంతో ఈదురుగాలుల హెచ్చరిక

హైదరాబాద్‌లో సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం



## హైదరాబాద్‌లో ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ స్టేడియం

హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో ప్రపంచస్థాయి క్రికెట్ స్టేడియం


గుజరాత్‌లోని మోదీ స్టేడియంను మించిన సామర్థ్యంతో నిర్మాణం

100 ఎకరాల భూమిని ఇవ్వనున్న రాష్ట్ర ప్రభుత్వం

నిర్మాణ, నిర్వహణ ఖర్చులను భరించనున్న బీసీసీఐ

డిసెంబర్‌లో శంకుస్థాపన చేసేందుకు సన్నాహాలు

హైదరాబాద్‌లో ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ స్టేడియం నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. భారత్ ఫ్యూచర్ సిటీలో ప్రపంచస్థాయి క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పించారు.





# వెయ్యి రోజుల.. ప్రజా పాలన

సంక్షేమం.. అభివృద్ధి.. పెట్టుబడులే ప్రాధాన్యంగా రేవంత్ సర్కారు

రైతుకు రుణమాఫీ.. భరోసా

సన్న వడ్లకు రూ.500 బోనస్

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

రూ.500కే గ్యాస్ సిలిండర్

గృహజ్యోతితో ఉచిత విద్యుత్

మహిళా సంఘాలకు భారీ రుణాలు

పేదల సొంతింటికి 'ఇందిరమ్మ' భరోసా

లక్షలాది కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు

43 లక్షల మందికి సామాజిక భద్రత

హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం వెయ్యి రోజుల పాలనను పూర్తి చేసుకుంది. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన అందించడంతోపాటు సంక్షేమం, సామాజిక న్యాయం, వ్యవసాయం, మహిళా సాధికారత, విద్య, వైద్యం, ఉద్యోగ కల్పన, పెట్టుబడులు, మౌలిక వసతులపై ప్రభుత్వం దృష్టి సారించినట్లు వెల్లడించింది. వెయ్యి రోజుల పాలనలో చేపట్టిన కార్యక్రమాలు, సాధించిన ప్రగతికి సంబంధించిన గణాంకాలను ప్రభుత్వం విడుదల చేసింది.

రైతు సంక్షేమానికి రూ.1.68 లక్షల కోట్లు

అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతుల సంక్షేమం కోసం రూ.1.68 లక్షల కోట్లు ఖర్చు చేసినట్లు ప్రభుత్వం తెలిపింది. రూ.2 లక్షల వరకు పంట రుణమాఫీతో 25 లక్షల రైతు కుటుంబాలకు





## మోదీకి ఉజ్బెకిస్థాన్ పురస్కారం.. బాబర్‌ను గుర్తుచేసిన ఒవైసీ

ప్రధాని మోదీకి ఉజ్బెకిస్థాన్ అత్యున్నత పురస్కారం

మొఘల్ చక్రవర్తి బాబర్ పుట్టిన దేశమే ఇదని గుర్తుచేసిన ఒవైసీ

బాబర్‌ను విమర్శించే బీజేపీకి ఇదే నా అభినందనలంటూ వ్యంగ్యం

ఇరు దేశాల మధ్య సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యంపై ఒప్పందం

ప్రధాని నరేంద్ర మోదీకి ఉజ్బెకిస్థాన్ అత్యున్నత పురస్కారం లభించడంపై ఏఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మొఘల్ సామ్రాజ్య స్థాపకుడు

(మిగతా 2వ పేజీలో..)





## 'ఇట్స్ డన్ బ్రో'.. సల్మాన్ వ్యాఖ్యపై తొలిసారి స్పందించిన సోనమ్ వాంగ్‌చుక్

సల్మాన్ ఖాన్ 'ఇట్స్ డన్ బ్రో' వ్యాఖ్యపై స్పందించిన సోనమ్ వాంగ్‌చుక్

నీట్-యూజీ పేపర్ లీక్ ఆరోపణలపై జులైలో వాంగ్‌చుక్ నిరాహార దీక్ష

దీక్ష విరమించాలని కోరుతూ అప్పట్లో సల్మాన్ ఖాన్ చేసిన పోస్ట్ వైరల్

బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్ చేసిన "సోనమ్, ఇట్స్ డన్ బ్రో" అనే వైరల్ వ్యాఖ్యపై విద్యావేత్త, సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ తొలిసారి ఆచితూచి స్పందించారు. ఈ వ్యాఖ్య వెనుక ఉన్న భావనను తాను గౌరవిస్తానని, అయితే ప్రముఖులకు ఉండే ఒత్తిళ్లను కూడా అర్థం చేసుకోవాలని సూచించారు. ఇటీవల యూట్యూబర్ ప్రఖర్ గుప్తా పోడ్‌కాస్ట్‌లో పాల్గొన్న వాంగ్‌చుక్‌కు, "సోనమ్, ఇట్స్ డన్ బ్రో" అని రాసి

(మిగతా 2వ పేజీలో..)





## వెలిగొండ సొరంగంలో కృష్ణా జలాల ప్రవాహం చరిత్రాత్మకం: నారా లోకేశ్

వెలిగొండ ప్రాజెక్టు రేపు జాతికి అంకితం చేయనున్న సీఎం చంద్రబాబు

ఇవాళ తొలిసారిగా సొరంగంలోకి ప్రవహించిన కృష్ణా జలాలు

ఇది చరిత్రాత్మక ఘట్టమన్న మంత్రి నారా లోకేశ్

ఫేజ్-1తో లక్షలాది మందికి సాగు, తాగునీటి ప్రయోజనం

మూడు దశాబ్దాల సుదీర్ఘ స్వప్నం ఎట్టకేలకు సాకారమైందని, వెలిగొండ ప్రాజెక్టు సొరంగం గుండా తొలిసారిగా కృష్ణా జలాలు ప్రవహించడం చరిత్రాత్మకమని రాష్ట్ర




## తమన్‌కు రూ.10 లక్షలు ఇవ్వలేదు.. మద్రాస్ హైకోర్టులో సీఎం విజయ్ అఫిడవిట్



ఎన్నికల ప్రచార గీతం కోసం తమన్‌కు రూ.10 లక్షలు ఇచ్చారన్న ఆరోపణలు

ఎన్నికల ప్రచార గీతం కోసం తమన్‌కు రూ.10 లక్షలు ఇవ్వలేదన్న సీఎం విజయ్

చెల్లింపులు జరిపినట్లు ఎలాంటి ఆధారాలు లేవని, ఆరోపణలు ఊహాజనితమని వాదన

విదేశీ విరాళాలు, ఇతర ఖర్చుల ఆరోపణల్లోనూ పసలేదని స్పష్టీకరణ

ఆధారాలు లేనందున పిటిషన్‌ను కొట్టివేయాలని హైకోర్టుకు విజ్ఞప్తి

తన ఎన్నికల ప్రచార గీతం కోసం ప్రముఖ సంగీత దర్శకుడు తమన్‌కు రూ.10 లక్షలు చెల్లించారంటూ వస్తున్న ఆరోపణలను తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ ఖండించారు. ఈ ఆరోపణలు పూర్తిగా నిరాధారమని, వాటిని నిరూపించేందుకు ఎలాంటి ఆధారాలు లేవని స్పష్టం చేస్తూ ఆయన మద్రాస్ హైకోర్టులో ఒక అఫిడవిట్ దాఖలు చేశారు. పెరంబూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో తన చేతిలో ఓటమి

(మిగతా 2వ పేజీలో..)

## విదేశాల్లోని భారతీయులకు మోహన్ భగవత్ కీలక సందేశం

విదేశాల్లో నివసిస్తున్న భారతీయులకు ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ దిశానిర్దేశం


వారు నివసించే దేశ పౌరులుగా నిజాయతీగా ఉండాలని సూచన

భారత ఐక్యత, సేవా సందేశాన్ని ప్రపంచానికి అందించాలని పిలుపు

భారత్ ఎప్పుడూ మహాశక్తిగా కాకుండా, విశ్వగురువుగా నిలిచిందని వ్యాఖ్య

ప్రపంచ సమస్యలకు భారతీయ జీవన విధానమే పరిష్కారమని ఉద్ఘాటన

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) చీఫ్



విజయకేరటం
తెలుగు దినపత్రిక



## సంపాదకీయం

# నేపాల్ వరదల్లో ఇన్ఫోసిస్ సీఈఓ అదృశ్యం

హిమాలయ కొండల్లో ఒక్కసారిగా విరుచుకుపడిన మెరుపు వరదలు వందలాది మంది ప్రాణాలు బలి తీసుకున్నాయి. వేల మంది జాడ ఇంకా తెలియ లేదు. ఆ విపత్తు బీభత్సంలో భారత ఐటీ రంగానికి చెందిన ఉన్నతాధికారి కూడా అదృశ్యమయ్యారు. ఇన్ఫోసిస్ అనుబంధ సంస్థ 'ఇన్ఫోసిస్ పబ్లిక్ సర్వీసెస్' సీఈఓ లక్ష్ గోపిశెట్టి ఆచూకీ లభించడం లేదు.వ్యక్తిగత పర్యటన నిమిత్తం నేపాల్‌కు వెళ్లిన ఆయన, వరదల తర్వాత కాంటాక్ట్ లో లేరని ఇన్ఫోసిస్ అధికారికంగా ప్రకటించింది. సహోద్యోగి లక్ష్ గోపిశెట్టి ఆచూకీ ప్రస్తుతం లభించడం లేదని, ఆయన క్షేమం కోసం ప్రయత్నం చేస్తున్నామని ఆ సంస్థ ప్రకటించింది. సంబంధిత అధికారులు, ఏజెన్సీలతో కలిసి సమాచారం సేకరించి సంప్రదింపులు జరపడానికి ప్రయత్నిస్తున్నారు. కుటుంబంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ అవసరమైన సహాయం అందిస్తున్నామని కంపెనీ తెలిపింది.

30 ఏళ్ల అనుభవం...

ప్రభుత్వ రంగ సాంకేతిక నిపుణుడు

లక్ష్ గోపిశెట్టి ఐటీ, పబ్లిక్ సెక్టార్‌లో మూడు దశాబ్దాలకు పైగా అనుభవం కలిగిన సీనియర్ అధికారి. ఇన్ఫోసిస్ పబ్లిక్ సర్వీసెస్ అమెరికా, కెనడాల్లోని ప్రభుత్వ రంగ సంస్థలకు వ్యూహాత్మక సాంకేతిక సేవలు అందిస్తుంది. ఆయన గతంలో ఇన్ఫోసిస్‌లో గ్లోబల్ వైస్ ప్రెసిడెంట్‌గా, యాక్సెంచర్‌లో మేనేజింగ్ డైరెక్టర్‌గా పనిచేశారు. ఐబీఎం, పీడబ్ల్యూసీ, హెచ్ సీ ఎల్, బేరింగ్ పాయింట్ వంటి సంస్థల్లో కూడా కీలక బాధ్యతలు నిర్వహించారు. ప్రభుత్వ సంస్థలకు టెక్నాలజీ, ఆపరేషన్స్, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్‌పై సలహాలు ఇస్తూ వ్యూహాలు రూపొందించడంలో ఆయన సిద్ధహస్తులు.

నేపాల్-టిబెట్ సరిహద్దు విపత్తు...

నేపాల్-టిబెట్ సరిహద్దు ప్రాంతాల్లో సంభవించిన ఈ ఆకస్మిక వరదలు విపత్తుగా మారాయి. నేపాల్ అధికారుల ప్రకారం మరణాల సంఖ్య 600కు పైగా చేరుకుంది. వేల మంది ఇంకా గల్లంతయ్యారు. భారత విదేశాంగ శాఖ ప్రకారం కనీసం 275 నుంచి 320 మంది భారతీయులు ఆచూకీ లభించడం లేదు. చైనా వైపు చిక్కుకున్న మరికొందరు భారతీయులు సురక్షితంగా నేపాల్‌కు చేరుకున్నారు. రక్షణ చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.కర్ణాటక ప్రభుత్వం కూడా రాష్ట్రం నుంచి లక్ష్ గోపిశెట్టి సహా 17 మంది గల్లంతయ్యారని తెలిపింది.

కుటుంబం, కంపెనీ ఆందోళన...

ఐటీ రంగంలో ఎన్నో విజయాలు సాధించిన ఒక అనుభవజ్ఞుడు... నేపాల్ వరదల్లో చిక్కుకుపోవడం అందరినీ కలవరపెడుతోంది. ఇన్ఫోసిస్ ఆయన కుటుంబానికి పూర్తి మద్దతు ఇస్తోంది. ప్రభుత్వ ఏజెన్సీలు, రక్షణ బృందాలు ఆయన జాడను వెతుకుతున్నాయి.

ప్రకృతి వైపరీత్యాల ముందు మనిషి ఎంత చిన్నవాడో ఈ ఘటన మరోసారి గుర్తు చేస్తోంది. లక్ష్ గోపిశెట్టి సురక్షితంగా కనిపించాలని, అలాగే వరదల్లో చిక్కుకున్న అందరి క్షేమం కోసం ఆశిద్దాం...

**- సమీ, సీనియర్ జర్నలిస్ట్.**

# వెయ్యి రోజుల.. ప్రజా పాలన

మొదటి పేజీ తరువాయి)

ప్రయోజనం కల్పించినట్లు పేర్కొంది. రైతు భరోసా కింద రూ.36 వేల కోట్లకుపైగా పెట్టుబడి సాయం అందించింది. సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లించడంతోపాటు గత యాసంగిలో 81.12 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు వెల్లడించింది.

మహిళలకు మహాలక్ష్మి.. గృహజ్యోతి

మహాలక్ష్మి పథకం కింద ఆర్టీసీ బస్సుల్లో మహిళలు 335 కోట్లకుపైగా ఉచిత ప్రయాణాలు చేసినట్లు ప్రభుత్వం తెలిపింది. దీంతో మహిళలకు దాదాపు రూ.11 వేల కోట్ల మేర ఆదా అయినట్లు పేర్కొంది. గృహజ్యోతి పథకం ద్వారా 53 లక్షలకుపైగా కుటుంబాలకు నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు వెల్లడించింది. 43 లక్షల కుటుంబాలకు రూ.500కే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నట్లు తెలిపింది. మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా రూ.60,487 కోట్ల రుణాలు అందించడంతోపాటు రూ.1,900 కోట్ల వడ్డీ రాయితీ కల్పించినట్లు ప్రభుత్వం పేర్కొంది. మహిళా సంఘాలకు వివిధ ఉపాధి అవకాశాలు కల్పిస్తూ ఆర్థికంగా బలోపేతం చేస్తున్నట్లు తెలిపింది.

పేదల సంక్షేమానికి ప్రాధాన్యం

పేదలకు 15 లక్షలకుపైగా కొత్త రేషన్ కార్డులు జారీ చేసినట్లు ప్రభుత్వం వెల్లడించింది. రాష్ట్రవ్యాప్తంగా 3.38 కోట్ల మందికిపైగా ఆహార భద్రత కల్పిస్తున్నట్లు తెలిపింది. సొంతింటి కలను సాకారం చేసేందుకు 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టినట్లు పేర్కొంది. అర్హత కలిగిన కుటుంబాలకు ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నట్లు తెలిపింది. 2.25 లక్షల మందికి కొత్తగా పింఛన్లు మంజూరు చేయడంతో రాష్ట్రవ్యాప్తంగా 43 లక్షలకుపైగా లబ్ధిదారులకు సామాజిక భద్రతా పింఛన్లు అందుతున్నాయని ప్రభుత్వం వెల్లడించింది.

విద్య.. ఉద్యోగాలపై దృష్టి

ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటివరకు 105 పాఠశాలలకు అనుమతులు ఇచ్చినట్లు తెలిపింది. విద్యార్థులకు అల్పాహారం, పాలు, పోషకాహారం అందించేందుకు రూ.720 కోట్లు కేటాయించినట్లు పేర్కొంది. ఉస్మానియా విశ్వవిద్యాలయానికి రూ.1,000 కోట్లు కేటాయించింది. రాష్ట్రంలో 72 వేలకుపైగా ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి చర్యలు చేపట్టినట్లు ప్రభుత్వం తెలిపింది.

ఆరోగ్యశ్రీ రూ.10 లక్షలకు పెంపు

ప్రజారోగ్యానికి ప్రాధాన్యం ఇస్తూ రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచినట్లు ప్రభుత్వం వెల్లడించింది. గోషామహల్‌లో రూ.2,700 కోట్లతో 2 వేల పడకల కొత్త ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణం చేపట్టింది. హైదరాబాద్ నలుదిక్కుల్లో టిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల ఏర్పాటుతోపాటు తొమ్మిది కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలలను ఏర్పాటు చేసినట్లు తెలిపింది. డ్రగ్స్ నియంత్రణ కోసం ప్రత్యేక విభాగాన్ని, ఆహార కల్తీ నియంత్రణకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వం పేర్కొంది.

పెట్టుబడులకు తెలంగాణ గమ్యస్థానం

టీజీ-ఐపాస్ ద్వారా రూ.1.29 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చినట్లు ప్రభుత్వం తెలిపింది. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025లో రూ.5.75 లక్షల కోట్ల పెట్టుబడులకు సంబంధించిన ఒప్పందాలు కుదిరినట్లు వెల్లడించింది. టీజీఐఐసీ భూముల్లో రూ.92,281 కోట్ల పెట్టుబడులతో 78 వేలకుపైగా ఉద్యోగ అవకాశాలకు మార్గం ఏర్పడిందని పేర్కొంది.హైదరాబాద్‌లో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల సంఖ్య 355కు పైగా ఉందని, 2026లో మరో 40 సంస్థలు నగరాన్ని తమ కేంద్రాలుగా ఎంచుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది. 2025-26లో రాష్ట్ర ఐటీ ఎగుమతులు రూ.3.97 లక్షల కోట్లకు చేరాయని, ప్రత్యక్ష ఐటీ ఉద్యోగాల సంఖ్య 12.14 లక్షలకు పెరిగిందని వెల్లడించింది.

భవిష్యత్ తెలంగాణకు భారీ ప్రాజెక్టులు

రీజినల్ రింగ్ రోడ్డు, మెట్రో రైలు విస్తరణ, మూసీ పునరుజ్జీవనం, భారత్ ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీ తదితర ప్రాజెక్టులపై ప్రభుత్వం దృష్టి సారించింది. రాష్ట్రాన్ని పెట్టుబడులకు, పరిశ్రమలకు, సాంకేతిక రంగానికి ప్రపంచ స్థాయి కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు పేర్కొంది. 2034 నాటికి తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ప్రభుత్వం ప్రకటించింది.

## విదేశాల్లోని భారతీయులకు మోహన్ భగవత్ కీలక సందేశం

మొదటి పేజీ తరువాయి)

మోహన్ భగవత్, ప్రపంచవ్యాప్తంగా నివసిస్తున్న ప్రవాస భారతీయులకు కీలక సందేశం ఇచ్చారు. వారు ఏ దేశంలో నివసిస్తున్నా, ఆ దేశానికి నిజాయతీపరులైన, సహాయకారులైన పౌరులుగా ఉండాలని, అదే సమయంలో ఐక్యత, సేవా మార్గమనే భారత సందేశాన్ని ప్రపంచంతో పంచుకోవాలని పిలుపునిచ్చారు. కెనడాలోని గ్రేటర్ టొరంటో ఏరియాలో 2,000 మందికి పైగా ప్రవాస భారతీయులు, హిందూ సమాజ సభ్యులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు."ప్రపంచాన్ని స్నేహంతో ఆలింగనం చేసుకోవడం" అనే ఇతివృత్తంతో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా భగవత్ మాట్లాడుతూ.. "భారత్‌తో సంబంధం ఉన్నవారు ఈ రోజు ప్రపంచవ్యాప్తంగా స్థిరపడి, వివిధ దేశాల పౌరులుగా ఉండవచ్చు. వారు ఏ దేశంలో ఉన్నా.. అక్కడ నిజాయతీగా, ఆ దేశానికి దోహదపడే పౌరులుగా మెలగాలి" అని స్పష్టం చేశారు. అదే సమయంలో, "అంతా ఒక్కటే" అనే భారతీయ దృక్పథాన్ని ప్రపంచానికి అందించాల్సిన బాధ్యత వారిపై ఉందని అన్నారు. వ్యక్తి, సమాజం, పర్యావరణం ఒకదానికొకటి హాని చేసుకోకుండా కలిసి అభివృద్ధి చెందగలవని తెలిపారు.భారతదేశం ఎప్పుడూ ఇతర దేశాలను ఆక్రమించుకోవడానికి లేదా మత మార్పిడులకు ప్రయత్నించలేదని, కేవలం జ్ఞానాన్ని పంచిందని భగవత్ గుర్తుచేశారు. "భారతీయులు వెళ్లిన ప్రతిచోటా గణితం, జ్యోతిష్యం, ఆయుర్వేదం వంటి జ్ఞానాన్ని అందించారు. నాగరికత విలువలను పంచారు. భారత్ ఎదిగినప్పుడల్లా అది మహాశక్తిగా కాకుండా, విశ్వగురువుగా కీర్తి పొందింది" అని ఆయన వ్యాఖ్యానించారు. హిందూ మతాన్ని ఒక నిర్దిష్ట భాష, పూజా విధానం లేదా జీవనశైలితో నిర్వచించలేమని, హిందువులు అందరినీ గౌరవిస్తారని, అన్నింటినీ స్వీకరిస్తారని వివరించారు. ప్రస్తుతం ప్రపంచం అనేక సంఘర్షణలు, పర్యావరణ ప్రమాదాలను ఎదుర్కొంటోందని భగవత్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యలకు హిందూస్థాన్ ప్రాచీన జీవన విధానమే సరైన పరిష్కారమని ఆయన అన్నారు. కేవలం విజయం సాధించిన జీవితం సరిపోదని, మానవత్వంపై ప్రేమతో నడుచుకోవాలని సూచించారు. ప్రపంచవ్యాప్తంగా ప్రతి దేశంలోనూ ఆదర్శవంతమైన సమాజాలను నిర్మించాలని, ఆచరణ ద్వారా నాయకత్వం వహించాలని కోరారు. 1925లో నాగ్‌పూర్‌లో స్థాపించబడిన ఆర్ఎస్ఎస్, 2025లో శతాబ్ది ఉత్సవాలు జరుపుకోనుంది. భగవత్ తన ఉత్తర అమెరికా పర్యటనలో భాగంగా న్యూయార్క్‌లో కూడా పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ స్టేడియం

మొదటి పేజీ తరువాయి)

ఆయన ఆదేశాలతో అధికారులు ఇప్పటికే అనువైన స్థలం కోసం అన్వేషణ ప్రారంభించారు. అంతా అనుకున్నట్టు జరిగితే ఈ ఏడాది డిసెంబర్‌లో ఈ భారీ స్టేడియం నిర్మాణానికి శంకుస్థాపన చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.ప్రస్తుతం దేశంలోనే అతిపెద్ద క్రికెట్ స్టేడియంగా గుజరాత్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం (1,32,000 సీటింగ్ సామర్థ్యం) ఉంది. దీనిని మించిపోయేలా ఫ్యూచర్ సిటీలో సుమారు 100 ఎకరాల విస్తీర్ణంలో కొత్త స్టేడియం నిర్మించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం భూమిని కేటాయించనుండగా, నిర్మాణ, నిర్వహణ వ్యయాలను భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) భరించనుంది. ఈ స్టేడియం నిర్మాణం కోసం ఎంపిక చేయబోయే ప్రాంతం ఔటర్ రింగ్ రోడ్డు, ప్రతిపాదిత రీజినల్ రింగ్ రోడ్డు, మెట్రో రైలు మార్గం, శంషాబాద్ విమానాశ్రయానికి సమీపంలో ఉండేలా చూస్తున్నారు. దీనివల్ల ప్రేక్షకులు సులభంగా రాకపోకలు సాగించవచ్చని అధికారులు భావిస్తున్నారు. ఫ్యూచర్ సిటీలో రానున్న స్పోర్ట్స్ సిటీ, టూరిజం, నెట్ జీరో సిటీ కాన్సెప్ట్‌లో ఈ క్రీడా ప్రాంగణం ఒక కీలక ఆకర్షణగా నిలవనుంది. కేవలం క్రికెట్‌కే కాకుండా, ఫుట్‌బాల్ మ్యాచ్‌లు, భారీ సంగీత కచేరీలు (కాన్సర్ట్‌లు) నిర్వహించేందుకు వీలుగా దీనిని మల్టీపర్పస్ వేదికగా తీర్చిదిద్దనున్నారు.

## తమన్‌కు రూ.10 లక్షలు ఇవ్వలేదు.. మద్రాస్ హైకోర్టులో సీఎం విజయ్ అఫిడవిట్

పాలైన డీఎంకే అభ్యర్థి ఆర్.డి. శేఖర్ దాఖలు చేసిన ఎన్నికల పిటిషన్‌కు సమాధానంగా విజయ్ ఈ అఫిడవిట్ సమర్పించారు. ఎన్నికల్లో విజయ్ 1,20,365 ఓట్లు సాధించగా, శేఖర్‌కు 66,650 ఓట్లు మాత్రమే వచ్చాయి. దీంతో 53,715 ఓట్ల భారీ ఆధిక్యంతో విజయ్ గెలుపొందారు. అయితే, విజయ్ ఎన్నికల ఖర్చు పరిమితిని మించిపోయారని, అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపిస్తూ శేఖర్ కోర్టును ఆశ్రయించారు.తన అఫిడవిట్‌లో విజయ్ కీలక అంశాలను ప్రస్తావించారు. ప్రచార గీతం 'తని ఒరువన్ వెడిచ్చు వరాన్, విసిల్లు ఒన్ను అడిచ్చు వరాన్' కోసం తమన్‌కు రూ.10 లక్షలు ఇచ్చి ఉండవచ్చని పిటిషనర్ 'విశ్వసనీయంగా తెలుసుకున్నట్లు' మాత్రమే పేర్కొన్నారని, ఇది పూర్తిగా ఊహాజనితమని విజయ్ తెలిపారు. డబ్బు చెల్లించినట్లు కానీ, అందుకు ఒప్పందం కుదిరినట్లు కానీ ఎలాంటి ఇన్వాయిస్, రశీదు లేదా లావాదేవీల ఆధారాలను పిటిషన్‌లో పొందుపరచలేదని ఆయన వాదించారు.చట్టబద్ధమైన ప్రచార పరిమితి రూ.40 లక్షలు దాటి ఖర్చు చేశారన్న ఇతర ఆరోపణలు కూడా అంచనాలపై ఆధారపడి ఉన్నాయే తప్ప, వాస్తవ చెల్లింపులకు ఆధారాలు లేవని విజయ్ పేర్కొన్నారు. విదేశీ విరాళాలు స్వీకరించారన్న ఆరోపణలను కూడా ఆయన తోసిపుచ్చారు. విదేశాల నుంచి ఎవరో సోషల్ మీడియా ఖాతా నడిపినంత మాత్రాన విదేశీ నిధులు అందినట్లు కాదని, ఏ విదేశీ దాత పేరునూ పిటిషన్‌లో ప్రస్తావించలేదని గుర్తుచేశారు. ఎన్నికల సమయంలో ప్రార్థనా స్థలాలను సందర్శించడం అవినీతి కిందకు రాదని కూడా స్పష్టం చేశారు. ఈ ఆరోపణలన్నింటికీ సరైన ఆధారాలు లేనందున, తన ఎన్నికను సవాల్ చేస్తూ ఆర్.డి. శేఖర్ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేయాలని ముఖ్యమంత్రి విజయ్ హైకోర్టును కోరారు.

### తెలంగాణలో చురుగ్గా రుతుపవనాలు.. పలు జిల్లాలకు హెచ్చరిక

మొదటి పేజీ తరువాయి)

తెలంగాణలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రుతుపవనాలు చురుగ్గా కదులుతుండటంతో పలు జిల్లాలకు 'ఎల్లో అలర్ట్' జారీ చేసింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం, దానికి అనుబంధంగా కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తాయని అధికారులు తెలిపారు.వాతావరణ శాఖ అంచనాల ప్రకారం.. ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. మిగిలిన ప్రాంతాల్లో ఓ మోస్తరు వానలు పడతాయని పేర్కొంది. వర్షం కురిసే సమయంలో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని హెచ్చరించింది. రాష్ట్రవ్యాప్తంగా రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుందని వాతావరణ కేంద్రం స్పష్టం చేసింది. ఇక హైదరాబాద్ నగరంలో ఈరోజు మధ్యాహ్నం లేదా సాయంత్రం వేళల్లో పలు చోట్ల ఉరుములతో కూడిన ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది.

### మోదీకి ఉజ్బెకిస్థాన్ పురస్కారం.. బాబర్‌ను గుర్తుచేసిన ఒవైసీ

మొదటి పేజీ తరువాయి)

బాబర్ పుట్టిన దేశం నుంచి ప్రధానికి ఈ గౌరవం దక్కడాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ బీజేపీ, సంఘ్ పరివార్‌పై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఈ పరిణామంపై బీజేపీకి శుభాకాంక్షలు తెలుపుతున్నానని, ఇది వారికి ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన సమయమని ఒవైసీ అన్నారు.ఆదివారం ఆయన మాట్లాడుతూ.. "భారత్‌కు బాబర్ ఏ దేశం నుంచి వచ్చాడో, అదే దేశం ఇప్పుడు మన ప్రధానమంత్రికి పురస్కారం ఇచ్చి గౌరవించింది. దీనికి బీజేపీకి నా అభినందనలు" అని వ్యాఖ్యానించారు. ప్రస్తుత ఉజ్బెకిస్థాన్‌లోని ఫెర్గానా లోయకు చెందినవాడే బాబర్ అని ఒవైసీ గుర్తుచేశారు. తరచూ తమ రాజకీయ విమర్శల్లో బాబర్ పేరును ప్రస్తావించే సంఘ్ పరివార్, ఆరెస్సెస్ మద్దతుదారులు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు. "మీరు బాబర్ పేరుతో ఎన్నో రకాలుగా దూషించారు, అవమానించారు. కానీ ఇప్పుడు అదే దేశ ప్రజలు మీకు అవార్డు ఇచ్చి గౌరవిస్తున్నారు. ఇకనైనా బాబర్ పేరుతో చేసే విమర్శలు ఆగిపోతాయని ఆశిస్తున్నా" అని ఒవైసీ పేర్కొన్నారు.రెండు రోజుల పర్యటన నిమిత్తం ఉజ్బెకిస్థాన్ వెళ్లిన ప్రధాని నరేంద్ర మోదీకి ఆ దేశ అధ్యక్షుడు షావ్కత్ మిర్జియోయెవ్ 'ఓలీ దరజలీ దోస్లిక్' (ఆర్డర్ ఆఫ్ ఫ్రెండ్‌షిప్) పురస్కారాన్ని ప్రదానం చేశారు. విదేశీ నేతలకు ఇచ్చే ఇది ఉజ్బెకిస్థాన్ అత్యున్నత పౌర పురస్కారం. ఈ అవార్డును భారత్-ఉజ్బెకిస్థాన్ మధ్య ఉన్న బలమైన స్నేహ బంధానికి అంకితమిస్తున్నట్లు ప్రధాని మోదీ తెలిపారు. ఈ పర్యటనలో ఇరు దేశాల సంబంధాలను సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి పెంచడంతో పాటు వాణిజ్యం, ఇంధనం వంటి రంగాల్లో సహకారాన్ని మరింత విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి గుర్తింపుగా ప్రధాని మోదీ గతంలోనూ పలు దేశాల నుంచి అత్యున్నత పురస్కారాలు అందుకున్న విషయం తెలిసిందే.




విజయకేరటం
తెలుగు దినపత్రిక
ఆగస్టు ।సోమవారం ।31 । 2026



# కాంగ్రెస్ వెయ్యి రోజుల విఫల పాలనపై పోరుబాట






నేడు... కే బి ఆర్ క్యాంపు కార్యాలయంలో.. నల్లగొండ నియోజకవర్గం ముఖ్య నాయకుల విస్తృతస్థాయి సమావేశం నల్లగొండ మాజీ శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి గారి అధ్యక్షతన జరిగినది... జెడ్పి మాజీ చైర్మన్ బండా నరేందర్ రెడ్డి గారు మిర్యాలగూడ మాజీ శాసనసభ్యులు నల్లమోతు భాస్కరరావు గారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.. కంచర్ల మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల విపల పాలనపై.. రాష్ట్ర పార్టీ ఇచ్చిన నిరసనల షెడ్యూల్ ను ప్రకటించారు.. సెప్టెంబర్ 1న ప్రెస్ మీట్. రెండో తేదీన నియోజకవర్గం కేంద్రంలో ధర్నా బాకీ కార్డుల పంపకం ఫ్లెక్సీ ప్రదర్శన మూడో తేదీన రైతు సదస్సులు సదస్సులు నాలుగవ తేదీన మహిళలు వికలాంగుల. వంటావార్పు, ఐదవ తేదీన ఫీజు రియంబర్స్మెంట్ జాబ్ క్యాలండర్ కొరకు యూత్ ర్యాలీలు ఏడవ తేదీన మండల జిల్లా ప్రజావాణిలో వినతి పత్రాలు సెప్టెంబర్ 8వ తేదీన అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రాలు ఎనమిది రోజుల కార్యక్రమాలపై ప్రెస్ మీట్.. పార్టీ ప్రకటించిన ఈ కార్యక్రమాలను కార్యకర్తలు నాయకులు, ప్రజలవద్దకు తీసుకుని వెళ్లి విజయవంతం చేయాలని కోరారు. జెడ్పి మాజీ చైర్మన్ బండ నరేందర్ రెడ్డి గారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మోసం మాటలతో గద్దెనెక్కిందని వారు పరిపాలన చేసేది మరొక సంవత్సరమేనని ఆ తర్వాత ఎన్నికల సంవత్సరమేనని.. ఈ మూడు సంవత్సరాల్లో వారు ప్రజలకు చేసింది ఏమీ లేదని తప్పుడు ప్రచారంతో కేసీఆర్ ను బదనామ్ చేస్తున్నారని ఉన్నారని.. నాయకులు కార్యకర్తలు వాస్తవాలు ప్రజలకు వివరించాలని కోరారు. మిర్యాలగూడ మాజీ శాసనసభ్యులు నల్లమోతు భాస్కరరావు గారు.. బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు గారు ఈనెల 3వ తేదీన మిర్యాలగూడ కు వస్తున్నందున నల్లగొండ నియోజకవర్గం లోని నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి రావాలని, విజ్ఞప్తి చేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ కటికం సత్తయ్య గౌడ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చీరా పంకజ్ యాదవ్ నల్గొండ మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి మాజీ ఎంపీపీ కరీం పాషా,బొజ్జ వెంకటయ్య, మాజీ జడ్పిటిసిలు తండు సైదులు గౌడ్ తుమ్మల లింగస్వామి, నగర పార్టీ అధ్యక్షులు బోనగిరి దేవేందర్, నల్గొండ మండల పార్టీ అధ్యక్షులు దేప వెంకటరెడ్డి,... ల తో పాటు పలువురు కార్పొరేటర్లు సర్పంచులు, నగర, మండల ముఖ్య నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# ముత్యాలమ్మ తల్లి దీవెనలు ప్రజలందరిపై వుండాలి

ముత్యాలమ్మ తల్లి దీవెనలు ప్రజలందరిపై వుండాలని బిజెపి రాష్ట్ర నాయకులు, మాజి ఎమ్మెల్యే సంకినేని వెంకటేశ్వర రావు అన్నారు. సూర్యాపేట పట్టణం తాళ్లగడ్డ లో అత్యంత వైభవంగా జరుగుతున్న శ్రీ శ్రీ శ్రీ ఇంద్రవెల్లి ముత్యాలమ్మ తల్లి బోనాల పండుగ సందర్భంగా, నేడు ఆలయానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు ఈ శుభ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మరియు కాలనీ ప్రజలు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక మన బోనాల పండుగ. . ఆ తల్లి దయతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ప్రార్థించాను అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ు మాజీ మున్సిపల్ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ , బిజెపి పట్టణ అధ్యక్షులు బూర మల్సూర్ గౌడ్, కర్నాటి కిషన్,ఎండి అబిద్, చల్లమల్ల నరసింహ,సలిగంటి వీరేందర్ , పల్సమల్సూర్ గౌడ్, బండపల్లి శ్రీనివాస్, యార్లగడ్డ రామారావు, తాళ్లపల్లి మధు లు పాల్గొన్నారు



# సాంకేతిక కారణాలతో ఓటర్లను ఇబ్బంది పెట్టొద్దు

2026 'సర్' ప్రక్రియ సందర్భంగా నల్లగొండ జిల్లాలో సుమారు రెండు లక్షల 64 వేల మందికి నోటీసులు అందజేసినట్లు అధికారుల లెక్కల ప్రకారం తెలుస్తుందని సిపిఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి తెలిపారు. మ్యాపింగ్ అయిన వారికి లాజికల్, డొమెస్టికల్, క్లరికల్ అక్షర దోషాలు ఉన్నాయని నేపంతో ఒక్కొక్క పోలింగ్ స్టేషన్లో సుమారు 100 నుండి 200 మందికి నోటీసులు జారీ అయ్యాయి. ఈ తప్పులన్నీ 2002 సంవత్సరంలో ఉన్న అప్పటి ఓటర్ల జాబితా తప్పులు దొర్లినట్లు చెప్పారు. ఉదాహరణకి నా యొక్క పేరు 289 నల్గొండ శాసనసభ నియోజకవర్గంలో 109 పోలీస్ స్టేషన్లో తుమ్మల వీరారెడ్డి తండ్రి నర్సిరెడ్డి పేరుతో నమోదయి ఉన్నది. కానీ మీరు 2002 ఓటర్ల జాబితాలో బిఎల్ఓ లకు ఇచ్చిన దాంట్లో వెంకటస్వామి తండ్రి వెంకట్ స్వామి అని నమోదు అయి ఉన్నదని నాకు నోటీస్ ఇచ్చారు ఇది మీ తప్పిదం వల్ల జరిగిందే తప్ప నాది తప్పు కాదన్నారు. దీనికి అప్పుడు ఓటర్ లిస్ట్ తయారు చేసిన వాళ్లే బాధ్యులన్నారు. విచారణల పేరుతో ఏ ఈ ఓ లు ఏ రకమైన ఆధారాలు ఇచ్చిన తీసుకొని ఓటర్లుగా పరిగణించాలని డిమాండ్ చేశారు. మొత్తం జిల్లా వ్యాప్తంగా విచారణ సమయం గడువు కూడా పెంచాలని రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని కోరారు. ఇప్పుడు ఇచ్చిన ఓటర్ల జాబితా ముసాయిదా మొత్తం కూడా తప్పులు తడకగా ఉందన్నారు. అక్టోబర్ లో ఇచ్చే ఓటర్ల జాబితా తప్పులు లేకుండా వచ్చే విధంగా జిల్లా ఎన్నికల అధికారులు ప్రత్యేకంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సెప్టెంబర్ రెండో తారీకు విద్యానగర్లోని గంగపుత్ర భవనం వద్దకు హాజరు కమ్మని తెలియచేసి ఉన్నారు. ఆ వ్యత్యాసం ఏమిటి? నేను ఏ రకమైన ధృవీకరణ పత్రాలు ఇవ్వాలో తెలియజేయలేదు న్నారు. 2.64 లక్షల మంది ఓటర్లను ఇలా మానసిక హింసకు గురిచేయడం సరైందేనా తండ్రి పేరులో ఉన్న తప్పు ఏమిటి? తెలుగులో అన్ని సరిగ్గానే ఉన్నాయి. మన తెలుగు పదాలనే ప్రమాణికంగా తీసుకోవాలి. ఇంగ్లీషులో ఒక అక్షరం బదులు మరో అక్షరం ఉంటే ఎవరిది బాధ్యత? దీన్ని ఎవరు రాశారని ప్రశ్నించారు. ఇందులో అత్యధిక భాగం సాంకేతిక పరమైన తప్పులు. అధికారుల స్థాయిలోనే పరిష్కరించి ఓటు హక్కు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.



తుమ్మల వీరారెడ్డి

# పోచమ్మ ఆలయంలో భక్తిశ్రద్ధలతో బోనం సమర్పణ





**కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించిన గన్నోజు శ్రీనివాసాచారి దంపతులు**

**వరంగల్ విజయ కెరటం ఆగస్టు 30:**

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 17వ డివిజన్ బొల్లికుంటలో గన్నోజు రాజలింగం జ్ఞాపకార్థం నిర్మించిన పోచమ్మ దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయ నిర్మాణ దాత, గన్నోజు రాజలింగం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు గన్నోజు శ్రీనివాసాచారి కుటుంబ సమేతంగా పోచమ్మ తల్లికి బోనం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.ప్రతి సంవత్సరం శ్రావణ మాసంలో గ్రామస్తుల ఆచారం ప్రకారం పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు, గన్నోజు రాజలింగం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గన్నోజు శ్రీనివాసాచారి దంపతులు మాట్లాడుతూ.. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండేలా పోచమ్మ తల్లి ఆశీస్సులు అందించాలని కోరుకున్నారు. అలాగే వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండి రైతాంగం సంతోషంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు.

## వివాహ వేడుకలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే - కంచర్ల భూపాల్ రెడ్డి

**తిప్పర్తి: ఆగస్టు 30 విజయ కెరటం ప్రతినిధి**



తిప్పర్తి మండలం చిన్నాయగూడెం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ మండల నాయకు లు బైరగోని శ్రీనివాస్ గౌడ్ రాజేశ్వరి కుమార్తె స్వాతి మహేష్ గౌడ్ వివాహ వేడుకకు మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో బియర్స్ జిల్లా నాయకులు మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి టిఆర్ఎస్ పార్టీ నాయకులు అభిమానులు కార్యకర్తలు తిప్పర్తి మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు మరియు తదితరులు పాల్గొని నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

## కూతురు నీట్ పీజీ పరీక్షకు వెళ్లి తిరిగొచ్చేలోపే విషాదం

**నల్గొండ: ఆగస్టు 30 విజయకేరటం ప్రతినిధి**



బీఆర్ఎస్ నాయకుడు సయ్యద్ జమాల్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ అండ్ రెస్పాండెంట్ సయ్యద్ జాఫర్ కుటుంబంలో విషాదం చోటుచేసుకుంది. ఆయన పెద్ద కూతురు నీట్ పీజీ పరీక్ష రాయాల్సి ఉండటంతో ఆమెను హైదరాబాద్‌కు తీసుకెళ్లి పరీక్ష రాయించి తిరిగి నల్గొండకు చేరుకునేలోపే కుటుంబంలో విషాదం నెలకొంది. తమ తల్లి గుండెపోటుతో ఉదయం 11 గంటల సమయంలో మృతి చెందినట్లు ఆయన చిన్న కూతురు తెలిపింది. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి.. వెంటనే సయ్యద్ జాఫర్ నివాసం చేరుకున్నారు. అక్కడ జాఫర్‌గారి కుటుంబాన్ని పరామర్శించారు. తన ఇద్దరు కూతుర్లు డాక్టర్ లేనని కాని, తమ ఇంట ఇలాంటి విషాదం జరిగినదని జాఫర్ తీవ్ర ఆవేదన చెందారు , తల్లి ని కోల్పోయిన ఇద్దరు కుమార్తె ల రోదనలతో కంచర్ల తో సహా అక్కడున్నవారందరుతీవ్రంగా చలించిపోయారు. వారిని ఓదార్చడం ఎవ్వరికీ సాధ్యం కాలేదు... కంచర్ల అక్కడే చాలాసేపు ఉండి. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.పార్థివ దేహాన్ని వారి స్వగ్రామమైన... మేళ్ల చెరువు లో ముస్లిం సంప్రదాయ పద్ధతుల్లో రేపు ఖననం చేయనున్నారు.రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ కటికం సత్తయ్య గౌడ్,ూవీజ మాజీ చైర్మన్ చీరా పంకజ్ యాదవ్, నల్లగొండ మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, నగర పార్టీ అధ్యక్షులు బోనగిరి దేవేందర్,మారగోని గణేష్ మాజీ ఎంపీపీ కరీం పాషా, గుండెబోయిన జంగయ్య,సిరిగిరి సురేష్ రెడ్డి, ఇర్ఫాన్,లతీఫ్ జమాల్ ఖాద్రి హాసన్ సలీం,రఫీ జహంగీర్, తదితరులు వెంట ఉన్నారు.

## నీట్ పీజీ పరీక్ష ప్రశాంతం.

### నీట్ పీజీ పరీక్ష సెంటర్ ను సందర్శించిన జిల్లా కలెక్టర్ బి . చంద్రశేఖర్

**నల్లగొండ ఆగస్టు 30 విజయకేరటం ప్రతినిధి**



జిల్లాలో నిర్వహించిన నీట్ పీజీ పరీక్ష ఎలాంటి ఇబ్బందులు లేకుండా, ప్రశాంతంగా నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ తెలిపారు. ఆదివారం ఆయన నల్గొండ జిల్లా కేంద్రంలోని ఎస్‌పీఆర్ పాఠశా లలో ఏర్పాటు చేసిన నీట్ పీజీ పరీక్ష కేంద్రాన్ని సందర్శించారు. పరీక్ష కేంద్రంలో సౌకర్యాలను పరిశీలించి, కేంద్ర ఇన్‌చార్జితో పరీక్ష నిర్వహణపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. నీట్ పి జి పరీక్షకు మొత్తం 180 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా, 179 మంది హాజరయ్యారని, ఒకరు గైర్హాజరయ్యారని పరీక్షా కేంద్రం ఇంచార్జ్ కలెక్టర్‌కు వివరించారు.పరీక్ష రాస్తున్న అభ్యర్థులకు తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు తదితర అన్ని మౌలిక సదుపాయాలు కల్పించారా అని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పరీక్ష కేంద్రం పరిసర ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, పోలీసు సిబ్బంది ని ఆదేశించారు. అదనపు సూపరింటిండెంట్ రమేష్ ,ఆర్డిఓ వై. అశోక్ రెడ్డి,డిఎస్పి శివరాశీమిరెడ్డి ,సిఐ ఆదిరెడ్డి ,పరీక్షల ఇంచార్జ్ ప్రొఫెసర్ ఉపేందర్ కలెక్టర్ వెంట ఉన్నారు

## ఉద్యమం లో మహిళలము భాగస్వామ్యం అవుతాము.

**దీక్ష లో అంగన్వాడి మహిళలు**

**సూర్యాపేట....**

బుల్లెట్ ట్రైన్ సాధన సమితి అఖిలపక్ష పోరాట కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలో 17వ రోజు అంగన్వాడి మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు రాష్ట్రాల రాజధానుల మధ్యలో ఉన్న సూర్యాపేట పట్టణం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నప్పటికీ పాలకుల నిర్లక్ష్యం కారణంగా రైలు మార్గాన్ని సాధించుకోలేకపోతునామన్నారు.కేంద్రం మంజూరు చేసిన బుల్లెట్ ట్రైన్ సూర్యాపేట మీదుగా ఇచ్చినట్టే ఇచ్చి పక్కదోవ పట్టిస్తున్న పాలకుల పై జమలు చేసి బుల్లెట్ అని తగ్గించుకుంటామని ప్రత్యేక చేశారు.ఈ దీక్షలో భాస్కరమ్మ, వసంత,ఏకలక్ష్మి సంతోషకుమారి, వెలుగు వనిత, పాల్గొన్నారు.ఈ దీక్ష కు బుల్లెట్ ట్రైన్ సాధన అఖిలపక్ష పోరాట కమిటీ కన్వీనర్ ప్రొఫెసర్ ఆరుట్ల జానకి రెడ్డి, రమణాచారి, ధర్మార్జున్,డేవిడ్ కుమార్, సి ఐ టి యు నాయకులు కోటగిరి వెంకట నారాయణ,నెమ్మాది వెంకటేశ్వర్లు,మట్టిపెల్లి సైదులు, జీడి బిక్షం, నవిలే ఉపేందర్,విద్యా సాగర్ రావు, నారబోయిన వెంకట్ యాదవ్, యాదయ్య,సట్టు నాగయ్య లు సంఘీభావం తెలిపారు.



విజయ కెరటం

తెలుగు దినపత్రిక

## బావిలో దూకి తల్లి, ఆరేళ్ల కూతురు మృతి

**మంచిర్యాల జిల్లా । ఆగస్టు 30, 2026 విజయ కెరటం ప్రతినిధి**





మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం లింగాపూర్ గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గోట్ల లచ్చన్న కుమార్తె గోట్ల రజిత తన ఆరేళ్ల కుమార్తెను నడుముకు కట్టుకుని బావిలో దూకినట్లు సమాచారం. ఈ ఘటనలో తల్లి రజితతో పాటు ఆమె ఆరేళ్ల కుమార్తె మృతి చెందినట్లు తెలుస్తోంది. ఘటనకు గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం. తల్లి, కుమార్తె మృతితో లింగాపూర్ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు, మృతికి గల కారణాలు పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి ఉంది.

## వెలిగొండ సొరంగంలో కృష్ణా జలాల ప్రవాహం చరిత్రాత్మకం: నారా లోకేశ్

మొదటి పేజీ తరువాయి)

మంత్రి, టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ పేర్కొన్నారు. కరవు పీడిత ప్రాంత ప్రజలు తరతరాలుగా ఎదురుచూస్తున్న క్షణం ఆవిష్కృతమైందని ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన తన సంతోషాన్ని పంచుకుంటూ కీలక వివరాలు వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రేపు ఈ ప్రాజెక్టు ఫేజ్–1ను జాతికి అంకితం చేసి, 10.7 టీఎంసీల నీటిని నల్లమల సాగర్‌లోకి విడుదల చేస్తారని లోకేశ్ తెలిపారు. సరిగ్గా 30 ఏళ్ల క్రితం ఈ పరివర్తనాత్మక ప్రాజెక్టుకు చంద్రబాబే శంకుస్థాపన చేశారని ఈ సందర్భంగా గుర్తుచేశారు. సొరంగం నుంచి తొలిసారిగా నీరు బయటకు వస్తుండటాన్ని చూడటం చాలా భావోద్వేగంగా ఉందని ఆయన వ్యాఖ్యానించారు. "ఇది కేవలం ఒక ఇంజనీరింగ్ అద్భుతం మాత్రమే కాదు. మన రైతులకు, కుటుంబాలకు, మొత్తం వెనుకబడిన ప్రాంతానికి ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న జీవనాడి" అని లోకేశ్ పేర్కొన్నారు. వెలిగొండ ప్రాజెక్టు ఫేజ్–1 ద్వారానే 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు అందనుందని, దాదాపు 4 లక్షల మంది ప్రజలకు తాగునీటి కష్టాలు తీరనున్నాయని వివరించారు. 'వెలిగొండ జలసిరులు' నిజంగా ఈ ప్రాంత అభివృద్ధికి రెక్కలు తొడుగుతాయని ఆయన అభివర్ణించారు. దశాబ్దాల తరబడి కరవుతో అల్లాడిన ప్రకాశం జిల్లా వాసుల కళ్లలో ఈ ప్రాజెక్టు ఆనందం నింపుతుందని లోకేశ్ ఆశాభావం వ్యక్తం చేశారు.

## 'ఇట్స్ డన్ బ్రో'.. సల్మాన్ వ్యాఖ్యపై తొలిసారి స్పందించిన సోనమ్ వాంగ్‌చుక్

మొదటి పేజీ తరువాయి)

ఉన్న టీ–షర్టును బహుమతిగా ఇచ్చారు. దానిని స్వీకరించిన ఆయన, సల్మాన్ వ్యాఖ్యపై అడిగిన ప్రశ్నకు బదులిచ్చారు. "ప్రతి ఒక్కరికీ వారి వారి పరిమితులు, ఒత్తిళ్లు ఉంటాయి. అన్ని వైపుల నుంచి ఆలోచించాల్సి ఉంటుంది. కానీ ఆయన ఏది చెప్పినా నేను దానిని గౌరవిస్తాను" అని వాంగ్‌చుక్ హిందీలో వ్యాఖ్యానించారు.

అసలేం జరిగింది?

గత జులైలో నీట్–యూజీ పరీక్ష పేపర్ లీక్ ఆరోపణలపై విద్యార్థులు దేశవ్యాప్తంగా నిరసనలు చేపట్టారు. వారికి మద్దతుగా సోనమ్ వాంగ్‌చుక్ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించారు. ఈ క్రమంలో మొదట విద్యార్థులకు మద్దతు ప్రకటించిన సల్మాన్ ఖాన్, ఆ మరుసటి రోజే దీక్ష విరమించాలని విద్యార్థులను కోరుతూ ఒక పోస్ట్ చేశారు. అదే పోస్ట్‌లో వాంగ్‌చుక్‌ను ప్రత్యేకంగా ఉద్దేశించి, "సోనమ్, ఇట్స్ డన్ బ్రో" అని వ్యాఖ్యానించారు. ఇంటి నుంచి వండిన ఆహారాన్ని పంపుతానని కూడా ఆఫర్ చేశారు. సల్మాన్ చేసిన ఈ వ్యాఖ్య సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయి, మీమ్స్‌కు దారితీసింది.

అయితే, సల్మాన్ విజ్ఞప్తిని పక్కనపెట్టి వాంగ్‌చుక్ తన దీక్షను కొనసాగించారు. చివరికి, నాటి కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామాతో సహా తమ ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం అంగీకరించడంతో ఆయన తన దీక్షను విరమించారు. ఈ సంఘటన జరిగి రోజులు గడుస్తున్నా, వాంగ్‌చుక్ దీనిపై ఎక్కడా స్పందించలేదు. తాజాగా పోడ్‌కాస్ట్‌లో ఆయన చేసిన వ్యాఖ్యలతో ఈ అంశం మళ్లీ చర్చనీయాంశమైంది. ప్రముఖులు ఎదుర్కొనే సంక్లిష్ట పరిస్థితులను అర్థం చేసుకుంటూనే, సల్మాన్ వ్యాఖ్యను గౌరవప్రదంగా స్వీకరించి వాంగ్‌చుక్ తన హుందాతనాన్ని చాటుకున్నారు.

## నిర్మలా సీతారామన్ జీ20 పర్యటన: ఇరాన్, చైనా అంశాలపై దృష్టి


**అమెరికాలో జరుగుతున్న జీ20 సమావేశాల్లో పాల్గొంటున్న నిర్మలా సీతారామన్**

**ఇరాన్ సంక్షోభం, ఇంధన భద్రతపై భారత్ ప్రధానంగా దృష్టి**

**అంతర్జాతీయ వాణిజ్య ఉద్రిక్తతలు, చైనా దిగుమతులపై ఆందోళన**

**భారత్‌ను ప్రత్యామ్నాయ తయారీ కేంద్రంగా ప్రమోట్ చేసే ప్రయత్నం**

అమెరికాలోని నార్త్ కరోలినా రాష్ట్రం, ఆష్‌విల్‌లో నిర్వహిస్తున్న జీ20 దేశాల ఆర్థిక మంత్రులు, సెంట్రల్ బ్యాంక్ గవర్నర్ల సమావేశంలో భారత్ పలు కీలక అంశాలను లేవనెత్తనుంది. ముఖ్యంగా ఇరాన్‌పై అమెరికా విధిస్తున్న ఆర్థిక ఆంక్షలు, అంతర్జాతీయ వాణిజ్య ఉద్రిక్తతలు, ఇంధన భద్రత వంటి అంశాలపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రధానంగా దృష్టి సారించనున్నారు. ఈ సమావేశాల్లో పాల్గొనే నిమిత్తం నిర్మలా సీతారామన్ నిన్న సౌత్ కరోలినాలోని గ్రీన్‌విల్–స్పార్టన్‌బర్గ్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్నారు. అమెరికాలో భారత రాయబారి వినయ్ మోహన్ క్వాత్రా ఆమెకు సాదర స్వాగతం పలికారు. రెండు రోజుల పాటు సాగే ఈ సదస్సుకు అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెస్సెంట్ ఆతిథ్యమిస్తున్నారు. ప్రపంచ ఆర్థిక వృద్ధి పునరుద్ధరణ, ఆర్థిక అసమతుల్యతలను తగ్గించడం, సరఫరా గొలుసులను బలోపేతం చేయడం వంటి అంశాలపై ఈ భేటీలో కూలంకషంగా చర్చించనున్నారు. అయితే, ఇరాన్ సంక్షోభం కారణంగా ఇంధన భద్రతకు వాటిల్లే ముప్పుపై భారత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోంది. ముడి చమురు, సహజవాయువు ధరలు పెరిగితే, అది భారత దిగుమతి వ్యయాన్ని పెంచడమే కాకుండా.. ద్రవ్యోల్బణం, రూపాయి విలువపై తీవ్ర ఒత్తిడిని కలిగిస్తుందని భారత్ భావిస్తోంది. మరోవైపు, చౌకగా లభించే చైనా ఉత్పత్తుల వల్ల దేశీయ పరిశ్రమలకు కలుగుతున్న నష్టాన్ని ఎత్తిచూపుతూనే, ఏకపక్ష సుంకాల విధింపును భారత్ వ్యతిరేకించనుంది. అంతర్జాతీయ సంస్థలకు భారత్‌ను ఒక ఆకర్షణీయమైన ప్రత్యామ్నాయ ఉత్పాదక, పెట్టుబడుల కేంద్రంగా ప్రమోట్ చేసేందుకు నిర్మలా సీతారామన్ ఈ వేదికను వినియోగించుకోనున్నారు. డిసెంబర్‌లో మయామిలో జరగనున్న జీ20 దేశాధినేతల శిఖరాగ్ర సమావేశానికి ఈ భేటీ ఒక సన్నాహక వేదికగా నిలవనుంది.





## తిరిగి షూటింగ్‌కు సిద్ధమైన రష్మిక.. ఇంట్లో గడిపిన రోజుల్ని మిస్సవుతా అంటూ పోస్ట్

'పుష్ప' బ్యూటీ, నేషనల్ క్రష్ రష్మిక మందన్న గాయం నుంచి పూర్తిగా కోలుకున్నారు. ఇటీవలే ఎదురైన తుంటి గాయం కారణంగా కొంతకాలంగా విశ్రాంతి తీసుకుంటున్న ఆమె, త్వరలోనే తిరిగి కెమెరా ముందుకు రానున్నట్లు సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. ఈ సందర్భంగా ఇంట్లో గడిపిన సరదా క్షణాలను గుర్తుచేసుకుంటూ ఓ పోస్ట్ పెట్టారు. "త్వరలోనే తిరిగి పనిలోకి వెళుతున్నాను. ఈ సమయాన్ని నేను కచ్చితంగా మిస్సవుతాను" అని రష్మిక తన పోస్టులో రాసుకొచ్చారు. విశ్రాంతి సమయంలో తాను కుటుంబంతో కలిసి ప్రార్థనలు చేయడం, సినిమాలు చూడటం, పజిల్స్ పూర్తి చేయడం, తన పెంపుడు జంతువులతో ఆడుకోవడం వంటి మధురమైన క్షణాలకు సంబంధించిన ఫొటోలను అభిమానులతో పంచుకున్నారు. కొద్ది రోజుల క్రితం 'మైసా' అనే తన కొత్త చిత్రం షూటింగ్ సమయంలో రష్మిక తీవ్రమైన తుంటి గాయానికి గురైన విషయం తెలిసిందే. దీంతో ఆమెకు వైద్యులు విశ్రాంతిని సూచించారు. ఈ విరామం తనకు జీవితం పట్ల కొత్త దృక్పథాన్ని ఇచ్చిందని రష్మిక గతంలో పేర్కొన్నారు. "గతంలో తీరిక లేకుండా పనిచేస్తున్నప్పుడు 'నెమ్మదించడం' అనేది భయంగా అనిపించేది. కానీ ఇప్పుడు విశ్రాంతి తీసుకున్నాక, ఆ హడావిడి జీవితమే భయంగా అనిపిస్తోంది. బహుశా ఇదే జీవితం కావచ్చు" అంటూ ఆమె తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. రష్మిక తిరిగి కోలుకుని షూటింగ్‌కు సిద్ధం కావడం పట్ల ఆమె అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. "నువ్వు పూర్తిగా కోలుకుని మళ్లీ పనిలో చేరడం చాలా సంతోషంగా ఉంది" "నిన్ను మళ్లీ తెరపై చూసేందుకు ఎదురుచూస్తున్నాం" అంటూ సోషల్ మీడియాలో కామెంట్లు పెడుతున్నారు. ఈ అప్‌డేట్‌తో ఆమె అభిమానులు తమ అభిమాన నటిని వెండితెరపై చూసేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## టాక్సిక్‌పై నెగెటివిటీ.. తీవ్రంగా స్పందించిన యశ్ తల్లి పుష్ప

కన్నడ రాకింగ్ స్టార్ యశ్ కథానాయకుడిగా నటించిన 'టాక్సిక్' చిత్రంపై జరుగుతున్న నెగెటివ్ ప్రచారంపై ఆయన తల్లి పుష్ప తీవ్రంగా స్పందించారు. తన కుమారుడి ఎదుగుదలను చూసి కొందరు కావాలనే కుట్రలు చేస్తున్నారని ఆమె ఆరోపించారు. ఈ విషయంపై పుష్ప మాట్లాడుతూ, "నా కొడుకు టెర్రరిస్ట్ కాదు. అతను కర్ణాటకలోనే పుట్టి పెరిగాడు. ఒక సాధారణ కుటుంబం నుంచి వచ్చి ఈ స్థాయికి ఎదిగాడు. అతని ఎదుగుదలను చూసి మీకెందుకు భయం? ఎందుకు అతనిపై ఇలాంటి దుష్ప్రచారం చేస్తున్నారు?" అని ఆవేదన వ్యక్తం చేశారు. యశ్‌ను ఒక టెర్రరిస్ట్‌తో పోల్చుతూ జరుగుతున్న ప్రచారాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు. గతంలో నిర్మాత అల్లు అరవింద్ "కేజీఎఫ్ కు ముందు యశ్‌ను ఎవరికీ తెలియదు" అని చేసిన వ్యాఖ్యలకు పరోక్షంగా పుష్ప కౌంటర్ ఇచ్చారు. "కేజీఎఫ్ చిత్రంతో యశ్ దేశవ్యాప్తంగా గుర్తింపు పొందాడు. కానీ, అంతకు ముందే కన్నడలో ఎన్నో హిట్ చిత్రాల్లో నటించాడు. ఇక్కడ అతను అప్పటికే ఒక పెద్ద స్టార్. ఈ విషయం మరిచిపోయి కొందరు మాట్లాడుతున్నారు" అని ఆమె గుర్తుచేశారు. ప్రస్తుతం యశ్ ఎదుర్కొంటున్న పరిస్థితులపై మాట్లాడుతూ, "ఎలాంటి కుట్రలు చేసినా మేము భయపడం. వాటన్నింటినీ ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నాం. నా కొడుకు పడుతున్న కష్టం నాకు తెలుసు. అతడిని దెబ్బతీయాలని చూసే ప్రయత్నాలు ఫలించవు" అని ఆమె ధీమా వ్యక్తం చేశారు. 'టాక్సిక్' సినిమా ప్రకటన వచ్చినప్పటి నుంచే కొన్ని వర్గాలు కావాలనే నెగెటివిటీని వ్యాప్తి చేస్తున్నాయని, దీని వెనుక పెద్ద కుట్రే ఉందని యశ్ అభిమానులు కూడా సోషల్ మీడియాలో ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో యశ్ తల్లి వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.



Printed, Published Edited and Owned by MAKSOOD AHAMED MOHAMED,H.No. 5-8-222/1, Shams Nagar, BTS Nalgonda - 508 001 (Telangana State) Printed at Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA 508 001, (Telangana State), Published From: Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA - 508 001 (A.P.), Editor: MAKSOOD AHAMED MOHAMED Cell: 9908408528